క్లుప్తంగా

డీఎస్పీ హనుమంతరావుకు సత్కారం



సత్తెనపల్లి: 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ డీఎస్పీగా అవార్డు అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావును సబ్ కోర్టు మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తా రామకృష్ణ, మారెళ్ళ మల్లేశ్వరరావు, శిరసాల భుజంగరావు, కొత్రపు.శ్రీనివాసరావు, దాసరి తిరుపతిరావు,షేక్.జాకీర్, మారెళ్ళ.స్వామి, ఆకుల.హనుమంతురావు, న్యాయవాదులు బీఎల్.చిన్నయ్య,దివ్వెల.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

జాతీయ అవార్డు గ్రహీత మురళికి సత్కారం



సత్తెనపల్లి: చేనేత ఇక్కత్ డిజైన్ కళ భవిష్యత్తరాలకు అందించాలని చేస్తున్న కృషికి సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళి జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డ్ జాతీయ చేనేత దినోత్సవం రోజు ఢిల్లీలో కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం జాతీయ చేనేత అవార్డు గ్రహీత కర్నాటి మురళిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికులకు ఉపాధి, నూతన పథకాల అమలుపై సూచనలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సొసైటీ ప్రెసిడెంట్ కట్టా శివ దుర్గారావు, నాయకులు ఆకుల హనుమంతరావు, మునిని బాబు, చేనేత సొసైటీ బాధ్యులు వంగర శ్రీనివాసరావు, చొప్పా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి సహకరిస్తాం


విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు



అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెంలో రామాలయ పునర్నిర్మాణానికి తమ వంతు సహకారం ఉంటుందని పల్నాడు జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు రవికుమార్, మట్టుపల్లి సుబ్బారాయుడు తెలిపారు. మండల ప్రముఖ్ తుమ్మా మల్రెడ్డి ఆధ్వర్యంలో కోగంటివారిపాలెంలో ఆదివారం సాయంత్రం రామాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో రామాలయం జీర్ణోద్ధరణకు గురయ్యే అవకాశం ఉన్నందున పునర్నిర్మాణానికి నిధులు సమకూర్చమని గ్రామస్తులు కోరగా వారు వెంటనే స్పందించారు. రామాలయ పునర్నిర్మాణంలో హిందూ పరిషత్ భాగస్వామి అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం గోరక్షా గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రంగురాళ్లంటూ మోసపోవద్దు

ఏఎస్ఐ ప్రసాద్




నకరికల్లు: రంగురాళ్ల మాయలో పడి మోసపోవద్దని ఏఎస్ఐ ప్రసాద్ సూచించారు. మండలంలోని నకరికల్లు శివారు, త్రిపురాపురం ప్రాంతాల్లో రంగురాళ్లు ఏరుకునేందుకు ఇతర జిల్లాల నుంచి వస్తున్నారు. వారికి ఏఎస్ఐ ప్రసాద్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపురాపురం కొండ ప్రాంతం, నకరికల్లు శివారు ప్రాంతాల్లో రంగురాళ్లు దొరుకుతున్నాయన్న దాంట్లో వాస్తవం లేదని, వదంతులు నమ్మి పనులు మానుకొని వచ్చి మోసపోవద్దన్నారు. దళారులు, అత్యాశాపరుల మాటలు నమ్మి సామాన్య ప్రజలు, కూలీలు మోసపోయి అన్ని విధాలా నష్టపోవద్దన్నారు. అపోహలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథుని ఆలయంలో గాయత్రి యజ్ఞం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో గాయత్రి యజ్ఞం ఆదివారం నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

కూలేలా ఉంది.. కనికరించండి సారూ..



ఇనుప చువ్వలు బయట పడి, ఒరిగిన విద్యుత్ స్తంభం

పెదకూరపాడు: కూలేలా ఉంది.. కనికరించండి సారూ.. అంటూ విద్యుత్ సిబ్బందిని వేడుకుంటున్నా కరుణించడం లేదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు, పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం (శివాలయం)కు వచ్చే భక్తులు దినదిన గండంగా ఉందని వాపోతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదకూరపాడు ప్రధాన రహదారిలోని పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఇనుప చువ్వలు బయట పడి.. ఒక పక్కకు ఒరిగిపోయి ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంభం కూలితే పెను ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంభంను తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే గానీ స్పందించరా..?!

షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభాలు



రఘురామ్‌నగర్‌లో డ్రెయిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభం

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్ నగర్‌లో వాటర్ ప్లాంట్ దగ్గర రెండు విద్యుత్ పోల్స్ డ్రెయిన్‌లో ఉన్నాయి. వాటి నుంచి విద్యుత్ వస్తుందని.. షాక్ కొడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2023 సంవత్సరంలోనే ఎస్టిమేషన్స్ వేసినప్పటికీ ఇంతవరకు వాటిని మార్చలేదు. దీనిపై అనేక సార్లు 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడమే కాకుండా మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాల్లో ప్రస్తావించినా ఇంతవరకు వాటి మార్పుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే గానీ స్పందించరా అంటూ వార్డు ప్రజలు విమర్శిస్తున్నారు.

డాక్టర్ విలియం కేరి జీవితం స్ఫూర్తిదాయకం



విజేతలతో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సంఘ కాపరి రెవ.ఇశ్రాయేలు

సత్తెనపల్లి: ఆధునిక మిషనరీ ఉద్యమ పితామహుడు రెవ.డాక్టర్ విలియం కేరి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సంఘ కాపరి రెవ.జె.ఇశ్రాయేలు అన్నారు. రెవ.డాక్టర్ విలియమ్ కేరి జయంతిని పురస్కరించుకుని సత్తెనపల్లి పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చిలో 'ప్రత్యేక ఆరాధన' ఆదివారం జరిగింది. సంఘ కాపరి రెవ.జె.ఇశ్రాయేలు దైవ వర్తమానాన్ని అందించి మాట్లాడారు. ఇంగ్లండ్‌లో జన్మించిన విలియం కేరి దేవుని ప్రణాళిక చొప్పున ఎన్నో కష్టాలు పడి 1793లో కలకత్తాకు వచ్చారని, సువార్త వ్యాప్తికి ఎంతగానో కృషి చేశారన్నారు. అనేక భాషలను నేర్చుకుని 40 భాషల్లో బైబిలును అనువాదం చేశారన్నారు. సతీ సహగమనానికి, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. రామాయణాన్ని ఆంగ్లంలోకి, బైబిలును సంస్కృతంలోకి తర్జుమా చేశారన్నారు. వ్యవసాయంలో అనేక నూతన పద్ధతులను రైతులకు వివరించి వ్యవసాయ రంగ నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ సందర్భంగా యవ్వనస్థులకు, సండే స్కూలు విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, రాత పరీక్ష పోటీల్లో ప్రతిభావంతులకు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సంఘ కాపరి ఇశ్రాయేలు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి చంద్రకాంత్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్ బాబు, కోశాధికారి జి.రవి రాజు, కార్యవర్గ సభ్యులు గంగవరపు ప్రసాద్, రాచపూడి జయపాల్, దంతం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌లు.. కొనుగోలుదారుల అవస్థలు



చౌటపాపాయపాలెం పంచాయతీ పరిధిలో అనుమతులు లేని లే అవుట్



ప్రభుత్వ అనుమతులు రాక ముళ్ల కంచెలతో నిలిచిపోయిన లే అవుట్

- మండలంలో విచ్చలవిడిగా అక్రమ లే అవుట్‌లు
- అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న వైనం
- నష్టపోతున్న ప్లాట్‌ల కొనుగోలుదారులు

రాజుపాలెం: మండలంలో విచ్చలవిడిగా అనుమతులు లేకుండా అక్రమ లే అవుట్‌లు ఏర్పాటు చేయడం వలన సాగు భూములు తరిగిపోతున్నాయి. ఏడాదికి రెండు పంటలు పండించే సారవంతమైన సాగు భూముల్లో దళారీలు రైతులను మభ్యపెట్టి ప్లాట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ, పంచాయతీ అనుమతులు ఉండవు. ప్లాట్‌లు కొనుగోలు చేసిన వినియోగదారులు తెలుసుకుని లబోదిబోమంటున్నారు. పంచాయతీ అధికారులు అక్రమం లే అవుట్‌లకు అనుమతులు లేవని బోర్డులు ఏర్పాటు చేస్తే అధికారులపై దళారీలు తిరగబడుతూ రాజకీయ రంగు పులుముతున్నారు.

30 ఎకరాలు.. 12 లే అవుట్‌లు

మండలంలోని కొండమోడు నుంచి రెడ్డిగూడెం వరకు మాచర్ల–గుంటూరు రహదారికి ఇరువైపులా సుమారు 12 లే అవుట్‌లు 30 ఎకరాలలో ఏర్పాటు చేశారు. ఏఒక్క లే అవుట్‌కు కూడా రెవెన్యూ పంచాయతీ అనుమతులు తీసుకోరు. దళారీలు ముందుండి తతంగం నడుపుతుంటారు. లే అవుట్ ఏర్పాటు చేసి అందులో ప్లాట్‌లుగా విభజించాలంటే కొన్ని నిబంధనలు పాటించాలి. ముందుగా సాగు భూమిని లే అవుట్‌గా మార్చాలంటే ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. అనంతరం పంచాయతీ తీర్మానాలు పొంది, పంచాయతీ నిబంధనలతో ప్లాట్‌లు ఏర్పాటు చేయాలి. సర్వే సర్టిఫికెట్ తీసుకోవాలి. తరువాత జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు పొందాలి. ప్లాట్‌లు ఏర్పాటు చేసే సమయంలో ఎకరాకు 10 సెంట్లు స్థలంను పంచాయతీ పరిధిలోకి ఇవ్వాలి. ఇప్పటికే మండలంలో ఏళ్ల తరబడి వేసిన అక్రమ లే అవుట్లలో కొన్ని ప్లాట్‌లు అమ్ముడుపోగా మిగిలిన ప్లాట్‌లు ముళ్ల కంచెలతో నిండి ఉన్నాయి. నిబంధనలు పాటించి లే అవుట్‌లు ఏర్పాటు చేయాలి. కానీ వీటికి విరుద్ధంగా లే అవుట్‌లు ఏర్పాటు చేసి ప్లాట్‌లు విక్రయిస్తుంటారు. దీంతో ప్లాట్‌లు కొన్న వినియోగదారులు నష్టపోయి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లే అవుట్లను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకపోతే నష్టపోతారు

వినియోగదారులు అన్ని అనుమతులు ఉన్న లే అవుట్లలోనే ప్లాట్‌లను కొనుగోలు చేయాలి. అనుమతులు లేకపోతే నష్టపోతారు. ప్రభుత్వ అనుమతులు పొందిన తరువాతనే పంచాయతీ నిబంధనలు పాటించి లే అవుట్‌లు ఏర్పాట్లు చేయాలి.

– పగడాల ముక్కంటి, ఈవోపీఆర్‌డీ, రాజుపాలెం

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



స్వామి వారి గ్రామోత్సవంలో మహిళల కోలాటం

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మూడవ రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కల్యాణ మహోత్సవంలో 20 జంటలు పాల్గొన్నాయి. వివిధ పుష్పాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కల్యాణ మహోత్సవంలో దేవస్థాన వ్యవస్థాపకులు, బాలాజీ ట్రస్ట్ చైర్మన్ పాతూరి వెంకట రమసుబ్బారావు దంపతులు పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కట్టవారిపాలెం మహిళల కోలాటం గ్రామస్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకం నిర్వహించగా చూపరులను ఆకట్టుకుంది.

ఇళ్ల మధ్య మురుగు... వ్యాధులకు నెలవు



పాటిబండ్ల ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగు



ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు

పెదకూరపాడు: అసలే వర్షాలు పడుతున్నాయి. దీంతో ఇప్పటికే పల్లెల్లో జ్వరాలు సంఖ్య క్రమేపి పెరుగుతుంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం పల్లెల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షలకు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉండి వ్యాధులకు నిలయంగా మారింది. అలాగే ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లు పెరిగి అధ్వానంగా ఉంది. మండలంలోని పాటిబండ్ల, లింగంగుంట్ల ఎస్సీ కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. మురుగు నీరు ముందుకు సాగే మార్గం లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురుగును, ఖాళీ స్థలాల్లో చెట్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని సాయి వృద్ధాశ్రయంలో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులు పండ్లను పంపిణీ చేశారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుత్తా పేరయ్య, కార్యదర్శి షేక్ రంజాన్‌వలి, జిల్లా కమిటీ సభ్యులు గుదే నరసింహారావు, కొమ్మ మహేష్, వి.సైదాచారి, ధీకొండ రామారావు, పఠాన్ సైదా, షేక్ కరిముల్లా, మహేష్‌రెడ్డి, అంజనేయులు, ఆరిఫ్, బాబూరావు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్టులు నాగేశ్వరరావు, ఖాశింలను సన్మానిస్తున్న దృశ్యం

సీనియర్ జర్నలిస్ట్‌లకు సన్మానం

మాచర్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పట్టణంలో రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, బీసీ నాయకులు బ్యంగా రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఎంఎస్ నాగేశ్వరరావు, ఖాశింలను సన్మానించారు. అనంతరం సూర్య కిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. సంఘం నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, మాగులూరి రాంబాబు, నరసరాజు, బాలబోయిన పాపారావు, శ్రీనివాసరెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

20న సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరు అవుతారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

దేవతామూర్తులకు బోనాలు సమర్పణ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రేగుమాణ్యం కాలనీకి చెందిన భక్తులు దేవతామూర్తులైన కుర్రం, ముత్యాలమ్మ, గంగమ్మ, కులదేవరకు ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆవుల మంగమ్మ, బాలస్వామి, ప్రతాప్ నేతృత్వంలో భక్తులు బోనాలను మేళతాళాలతో ఉత్సాహంగా... ఉల్లాసంగా దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కోదండ రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి దర్శి అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజల అనంతరం గోత్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా కాటా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా జంపని వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా గుర్రం ఆదినారాయణ, కోశాధికారిగా గాలి బుచ్చయ్య, జాయింట్ సెక్రటరీగా నార్నె శివయ్య ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఉన్న మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాటా రత్తయ్యలు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కండువాలు కప్పి ప్రసాదాలు అందించారు. మరో 14 మంది సభ్యులుగా కొనసాగనున్నారు. వీరి కాలపరిమితి ప్రతి రెండేళ్లకోసారి శ్రావణ మాసం వరకు కొనసాగుతుందన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

- భక్తజనంతో పులకించిన గో సంరక్షణ శాల
- నరసరావుపేట ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహణ



శ్రీకృష్ణుడికి 108 రకాల పిండి వంటకాలతో నైవేద్యం

సత్తెనపల్లి: నవనీత చోరుడు.. నీలమేఘ శ్యాముడు.. మురళీ కృష్ణుడు.. మురిపాల మోహనుడు.. చిన్ని కృష్ణయ్య పుట్టినరోజు.. జగమంతా వేడుకల రోజు అంటూ కృష్ణాష్టమి సందర్భంగా నందబాలలు, గోపికల సందడి ఆద్యంతం అంబరాన్నంటింది. అజ్ఞానాన్ని పారదోలేందుకు కృష్ణనామ మొక్కటే మార్గమని ఇస్కాన్ (అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం) తిరుపతి బాధ్యుడు హేమ హరి ప్రభు ప్రవచించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగల వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి గో సంరక్షణ శాల కల్యాణ మండపంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆయన ఉపన్యసిస్తూ నేడు ఎవరికి తోచినట్లు వారు జీవనం సాగిస్తూ సమాజంలో ఎన్నో అమానవీయ, అనాగరిక, అనైతిక, ఆడంబర ఆర్భాటాల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ శైలి నుంచి సమాజం వెలుపలికి రావాలంటే భగవద్గీత గురించి తెలుసుకొని కృష్ణ చైతన్యం అంగీకరించాలన్నారు. ముందుగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పాలాభిషేకం చేసి విశేష పూజలు నిర్వహించారు. గోపూజ, ఉట్లోత్సవం, మహా శంఖాభిషేకం (56 రకాల విశేష ద్రవ్యాలతో) తదుపరి 108 రకాలతో మహారాజ భోగ నివేదన చేపట్టారు. శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం, అనంతరం మహాప్రసాద వితరణ చేపట్టారు. ఉట్టి కొట్టేందుకు చిన్నారులు పోటీ పడ్డారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇస్కాన్ భక్త బృందం సత్తెనపల్లి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లడ్డూ గోపాలుడికి అభిషేకంలో మాతాజీ భవిరిశెట్టి వెంకటలక్ష్మి, ప్రభు శ్రీనివాసరావు



ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు

అనుమానాస్పదంగా యువకుడు మృతి



మృతుడు పీట్ల రామయ్య

రెంటచింతల: మండలంలోని గోలి గ్రామ సమీపంలోని నాగమయ్య స్వామి ఆలయం వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలు.. గోలి గ్రామానికి చెందిన పీట్ల రామయ్య(33)కు పదేళ్ల కిందట గురజాలకు చెందిన అంజలితో వివాహం జరిగింది. కాగా ఆమె ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో అతడు తల్లి వద్ద ఉంటున్నాడు. ఏడాది కిందట కూలీ పనుల నిమిత్తం కుటుంబ సభ్యులందరూ కలిసి గుంటూరుకు వెళ్లి జీవిస్తున్నారు. ఈ నెల 15న మృతుడు రామయ్య స్వగ్రామం గోలికి వచ్చి ఈ నెల 17 న నాగమయ్యస్వామి ఆలయం దగ్గరలో రోడ్డు పక్కన చిన్నచిన్న గాయాలతో చనిపోయి ఉండటంతో గ్రామానికి చెందిన దేవళ్ల ప్రసాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తల్లి చిన్న ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలచెరువులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. 300 మందికి కంటి పరీక్షలు చేశారు. సత్యవతి పిచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని పేద వారికి ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ కార్డియాలజీ డాక్టర్ శ్రీసనా, జనరల్ మెడిసిన్ డాక్టర్ దీపిక, ఆర్థోపెడిక్స్ డాక్టర్ అభిలాష, కంటి వైద్యులు అనిక, ఈఎన్‌టీ డాక్టర్ అమీనా, డెర్మటాలజీ డాక్టర్ విద్యాధర్, జనరల్ సర్జరీ డాక్టర్ పునీత, పెల్మోనాలజీ డాక్టర్ విద్యాలహరి, గైనకాలజీ డాక్టర్ హారిక, మార్కెటింగ్ మేనేజర్ రాంబాబు, బి.డి.ఓ రామకృష్ణ, పీఆర్వోలు శ్రీనాథ్, పురుషోత్తం పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ జీవనం



నరసరావుపేట ఈస్ట్: యోగాభ్యాసం ద్వారా పరిపూర్ణమైన జీవనాన్ని అనుభవించవచ్చని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) ప్రధాన ఆచార్యుడు ఆతుకూరి వేంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. యోగా సేవా కేంద్రం నరసరావుపేట రూరల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు, కేంద్రం 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వేంకటేశ్వర గురూజీ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అభ్యాసకులతో మాట్లాడుతూ, నిత్యం యోగను సాధన చేయాలని సూచించారు.రూరల్ శాఖ నిర్వాహకుడు జల్లి శ్రీనివాసరావు, చిలకలూరిపేట యోగా గురువులు కాపుగంటి శివప్రసాదరావు, కనమర్లపూడి శారద, సహాయ గురువులు బండి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.